తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

శనివారం
21 ఫిబ్రవరి 2026

పేజీలు - 8

## సింగరేణి అధికారుల బెదిరింపు చర్యలు

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 20(జనంసాక్షి):** సింగరేణి అధికారులను పంపించి తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని నూతనంగా గెలుపొందిన బీఆర్ఎస్ పార్టీ 11వ వార్డు కౌన్సిలర్ బొమ్మ భూమా గౌడ్ భార్య బొమ్మ విజయ ఆరోపించారు. శుక్రవారం ఆమె తన నివాస ఆవరణలో మీడియాతో మాట్లాడారు. కావాలనే కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగరేణి కాలరీస్ కంపెనీ ఎస్ అండ్ పీసీ అధికారులను పంపించి సూచిక బోర్డును ఏర్పాటు చేయించారని ఆమె పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా తాము ఇదే స్థలంలో నివసిస్తున్నామని, మున్సిపాలిటీకి పన్నులు కూడా కడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ చైర్మన్ పీఠానికి మద్దతు తెలుపకపోవడంతోనే, ఎన్నడూ లేని విధంగా రెండు రోజులుగా తమపై ఒత్తిళ్లు పెంచుతూ సింగరేణి అధికారులను ఉసిగొలిపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధంగా కక్షపూరితంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని ఆమె స్పష్టం చేశారు.





## భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పనులకు భూ సేకరణపై రెవెన్యూ, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా, భూ యజమానులకు చట్టబద్ధంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, నేషనల్ హైవే, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోపు భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు.



భూ యజమానులతో చర్చలు జరిపి వారి సందేహాలను నివృత్తి చేయాలని, పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ప్రాజెక్టు అమలులో ప్రజల సహకారం కీలకమని, అధికారులు ప్రజలతో సానుకూలంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పిఓ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి..

జిల్లా ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో వైద్య ఆరోగ్యశాఖ, టీజీ ఎమ్ ఐ డి సి అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో కలిసి జిల్లా ప్రభుత్వ మిగతా 8లో..

## విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్తమ విద్యా ప్రమాణాలు అందించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి

**వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అందిస్తూ ఉత్తమమైన విద్య వాతావరణంలో మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రంలో పీఎంశ్రీ పథకం కింద మంజూరైన నిధుల వినియోగం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత ఉండేలా సరైన జాగ్రత్తలు తీసుకోవాలనిని పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పీఎం శ్రీ జెడ్పిహెచ్ ఎస్ పాఠశాలను సందర్శించి, పీఎంశ్రీ పథకం కింద మంజూరైన నిధుల వినియోగం, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు విద్యా వాతావరణాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, నూతన వంటశాల, భోజనశాల, సైన్స్ ల్యాబ్, ఏటీఎల్ ల్యాబ్, గ్రంథాలయం, బాలురు-బాలికల మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు మరియు పాఠశాల ప్రాంగణంలోని పచ్చదనాన్ని స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. పీఎంశ్రీ పథకం లక్ష్యాలకు అనుగుణంగా పాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ విద్యా వాతావరణం కల్పించాలన్నారు. నూతనంగా నిర్మించిన వంటశాలను పూర్తిగా శుభ్రపరిచి తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని, ప్రస్తుత వంటశాల ప్రదేశాన్ని ఖాళీ చేసి శుభ్రపరచి అంగన్వాడీ కేంద్రానికి అప్పగించాలని ఆదేశించారు. వంటశాల సమీపంలోని డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరచి ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. నూతన భోజనశాలను పరిశుభ్రంగా నిర్వహిస్తూ విద్యార్థుల భోజనానికి సద్వినియోగం చేయాలని తెలిపారు. బాలికల మరుగుదొడ్లకు సౌకర్యవంతమైన మార్గం నిర్మించాలని, మరుగుదొడ్ల పరిశుభ్రత మరియు తాగునీటి సదుపాయాల నిర్వహణను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. సైన్స్ ల్యాబ్‌కు ర్యాంప్ నిర్మించి దివ్యాంగ విద్యార్థులకు సౌలభ్యం కల్పించాలని, అన్ని



కిటికీలకు మెష్ అమర్చాలని సూచించారు. గ్రంథాలయంలో పుస్తకాలను క్రమబద్ధంగా అమర్చి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలన్నారు. సైన్స్ ల్యాబ్ మరియు ఏటీఎల్ ల్యాబ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. క్రీడా సామగ్రిని సక్రమంగా ప్రదర్శించి విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించాలని, పాఠశాల ప్రాంగణంలోని చెట్లకు పేర్లు పెట్టి క్యూ ఆర్ కోడ్లతో లేబుల్ చేయాలని, “ఒక విద్యార్థి – ఒక మొక్క” కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. సందర్శనలో గుర్తించిన లోపాలను ఒక వారం లోపు సరిచేసి, ఫోటోలతో కూడిన అనుసరణ నివేదికను సమర్పించాలని ప్రధానోపాధ్యాయునికి జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత మరియు నాణ్యమైన విద్యను మరింత బలోపేతం చేయడం ద్వారా పీఎంశ్రీ పథకం లక్ష్యాలను సాధించేందుకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గొండి ఎంపీడీవో లెక్కల అరుంధతి, వేణుగోపాల్, ప్రధానోపాధ్యులు రామస్వామి, సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- హనుమకొండలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**హనుమకొండ ప్రతినిధి, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** హనుమకొండ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు గృహ నిర్మాణ, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. శుక్రవారం హంటర్ రోడ్డు న్యూశాయంపేట, హనుమకొండ అంబేద్కర్ నగర్ లలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బ్లాక్ లుగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కలెక్టర్ పరిశీలించి తాగునీరు, విద్యుత్, సీసీ రోడ్లు, నీటి సంపులు, వాటర్ ట్యాంకులు, డ్రైనేజీలు, తదితర మౌలిక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ పై ఉన్న వాటర్ ట్యాంక్ ను కలెక్టర్ పరిశీలించి నీటి సమస్యను వారిని అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకు సంబంధించిన మిగతా 8లో..

# టిజీబి ఖాతాదారులకు అందని బోనస్ డబ్బులు

## సమస్య ఎక్కడో తెలువక రైతుల సతమతం



**మల్హర్,ఫిబ్రవరి20(జనం సాక్షి)** ప్రభుత్వ రైతులకు అందించే సన్నాలకు క్వింటల్ కు రూ 500 బోనస్ డబ్బులు తాడిచర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు పడక పోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.ఐకెపి, సహకార సంఘాల ద్వారా విక్రయించిన రైతులకు ప్రభుత్వం ఎస్బీఐ ఖాతాదారులకు అందుతుందన్నట్లు పలువురు రైతులు పేర్కొనగ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు ధాన్యం బోనస్ డబ్బులు ఎందుకు పడడం లేదోనని గందరగోళానికి గురవుతున్నారు. ఈ విషయం పై మండల వ్యవసాయ అధికారిని ని వివరణ కోరగా సన్నాలకు రూ 500 బోనస్ అనేది సొసైటీ పరిధిలోని ఆంశమని తెలిపారు.ధాన్యం విక్రయించిన డబ్బులు తమ టిజిబి ఖాతాలో డబ్బులు జమ కాగా బోనస్ డబ్బులకు రైతులు ఎవరిని సంప్రదించాలో అర్థం కాక అయోమయంలో పడుతున్నట్లు బాలరాజు అనే రైతు వాపోయారు. పలువురు రైతులు పి ఎ సి ఎస్ కార్యాలయంలో సంప్రదిస్తే బ్యాంకు ఐ ఎఫ్ సి కోడ్ మారింది అని తెలిపారు.ధాన్యం డబ్బులు అదే బ్యాంకు లో జమ కాగా బోనస్ డబ్బులకు కోడ్ కు మారింది అని రైతులు అయోమయం లో ఉన్నారు.

# పాఠకులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి

## గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**పాఠకులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో 2026-27 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన బడ్జెట్ సర్వసభ్య సమావేశము స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 2026 -27 ఆర్థిక సంవత్సరంకు సంబంధించిన బడ్జెట్ అంచనాలపై చర్చించి, హైదరాబాద్ గ్రంథాలయ శాఖ పౌర సంచాలకులకు ప్రతిపాదనలు పంపించేందుకు అనుమతించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయుటకు నూతన పుస్తకాలు కొనుగోలు చేయుటకు ప్రాముఖ్యత చూపాలని అన్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల నుండి రావలసిన గ్రంథాలయ పన్నును జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయాలని జిల్లా పంచాయతీ ఆధికారిని కోరారు. గ్రంథాలయ పన్ను సకాలంలో చెల్లించినట్లయితే పాఠకులకు మెరుగైన సేవలను అందించుటకు సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి.శ్రీలత, విద్యాశాఖ ఆఫీసర్ కృష్ణమోహన్, జిల్లా పంచాయతీ శాఖ ఆఫీసర్ మోహన్, జిల్లా పౌర సంబంధ సమాచార శాఖ ఆఫీసర్ రంజిత్, గ్రంథాలయ సిబ్బంది టీ.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ నిర్మాణానికి కానిస్టేబుల్ దంపతుల చేయూత

**హనుమకొండ ,ఫిబ్రవరి 20 ( జనం సాక్షి ) :**హన్మకొండ వికాస్ నగర్‌లో నిర్మాణంలో కొనసాగు తున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి శుక్రవారం కానిస్టేబుల్ మస్సి కుమార్, ఆయన సతీమణి మమత10,000 రూపాయ లను విరాళంగా అందజేశారు. దేవాలయ నిర్మా ణ పనులు వేగంగా కొనసాగుతున్న ఈ సందర్భం లో భక్తుల సహకారం కూడా ఎంతో అవసరమని ముందు కొచ్చారు. ఈ నేపథ్యంలో మస్సి కుమా ర్ మమత దంపతులు తమ వంతు బాధ్యతగా ఆర్థిక సహాయం అందించారు.గతంలో క్రీడా కారు లకు ప్రోత్సాహంగా సహాయం అందించిన ఈ దంపతులు,నేడు ఆధ్యాత్మిక సేవలో భాగస్వాము లు కావడం సంతోషకరం.క్రీడలకు చేయూతనిచ్చి యువతను ప్రోత్సహించడం,ఇప్పుడు దేవాలయ నిర్మాణానికి అండగా నిలవడం,వీరి సేవాభావాన్ని కనబరుస్తుంది. సమాజంలోని ప్రతి మంచి కార్య క్రమానికి ముందుండి సహకరించడం ద్వారా మస్సి కుమార్ మమత దంపతులు ఆదర్శంగా నిలుస్తున్నారని స్థానికులు అభిప్రాయపడ్డారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



# కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

## సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్




**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 20(జనంసాక్షి):**క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ కాక వెంకటస్వామి పేరు ప్రతిష్టలను అబాసు పాలు చేసేలా మంత్రి వివేక్ వెంకటస్వామి, ఆయన మనవడు ఎంపీ గడ్డం వంశీకృష్ణ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఈ దౌర్జన్యాలను గమనిస్తున్నారని, ఇలానే కొనసాగితే ప్రజాక్షేత్రంలో చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు.ఈ నెల 11న జరిగిన క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో సీపీఐ?బీఆర్ఎస్ కూటమి 22 స్థానాల్లో పోటీ చేసి 14 స్థానాల్లో గెలిచి స్పష్టమైన మెజార్టీ సాధించిందన్నారు. అయితే కాంగ్రెస్ కేవలం ఏడు స్థానాలు గెలిచినా, అధికార అహంకారంతో దొడ్డిదారిన చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. పోలీస్, అధికారులతో కుమ్మక్కై చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు జరగకుండా సమావేశాన్ని రెండుసార్లు వాయిదా వేయడం సిగ్గుచేటన్నారు.ప్రమాణ స్వీకారం అనంతరం వాష్ బ్రేక్' పేరిట కాంగ్రెస్ కౌన్సిలర్లతో సమావేశం ఏర్పాటు చేసి హౌస్‌లో గొడవలకు ప్రేరేపించారని, సీపీఐకి చెందిన ఎస్టీ కౌన్సిలర్ మునిపై నిండు సభలో దాడి జరిగిందని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం దారుణమన్నారు. 17వ తేదీన జరిగిన ఘటనలకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రజల ముందుకు తీసుకువచ్చి, దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.చైర్మన్ ఎన్నికల రోజు కౌన్సిలర్లను అడ్డుకోవడం, రాళ్ల దాడులకు ప్రేరేపించడం ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని, ఈ ఘటనలను బీఆర్ఎస్‌పై నెట్టివేస్తూ తప్పుడు కేసులు పెట్టి కొందరిని జైలుకు పంపడం అన్యాయమని పేర్కొన్నారు. వెంటనే ఆ కేసులను ఎత్తివేయాలని కోరారు.ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు, మహిళా సమాఖ్య నాయకులు, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ,జిల్లా కలెక్టర్ సత్యశారద



**నర్సంపేట ఫిబ్రవరి 20 (జనం సాక్షి)**బంజారా బిడ్డలకు రిజర్వేషన్ కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ ఆవరణలో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకులకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ బంజారా బిడ్డలను ఎస్టీ జాబితాలో చేర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపింది అని అన్నారు. నూతనంగా ఎన్నికైన గిరిజన సర్పంచులు, కౌన్సిలర్లకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శుభాకాంక్షలుతెలియచేసారు, సేవాలాల్ మహారాజ్ ను స్ఫూర్తిగా తీసుకొని రాజకీయాల్లో మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.గిరిజనుల సంక్షేమానికి అనేక పథకాలను ఇప్పటికే ప్రవేశపెట్టామని,3500 ఇందిరమ్మ ఇండ్లు గాక నియోజకవర్గంలో ఎస్టీలకు ప్రత్యేకంగా మరో 250 ఇండ్లు అందించామని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్పర్సన్ పెండెం శ్రీ లక్ష్మి రామానంద్,ఆర్డీఓ ఉమారాణి,జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నారాయణ రెడ్డి,సేవాలాల్ ఉత్సవ సమితి చైర్మెన్ గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

### పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దొంతి



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 20( జనం సాక్షి):** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అక్కల్ చెడ గ్రామంలో రూ. 10 లక్షల సిడిఎఫ్ నిధుల నుండి డ్వాక్రా గ్రూపు మహిళల కోసం భవన నిర్మాణ పనులను శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అలాగే తేజావత్ భవాని బద్రు దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభోత్సవం చేసి దంపతులను ఆశీర్వదించారు. అలాగే గ్రామంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ ను పున: ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మాట ఇచ్చి మోసం చేసిందని ప్రజా పాలనలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తూ మహిళల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా మహిళల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మహిళలు ఘన స్వాగతం పలికారు. పేద ప్రజలను అదుకునేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఇందిరమ్మ ఇళ్ళతో పేదల కల సాకారం అయిందని వారి కళ్ళల్లో ఆనందాన్ని చూస్తున్నామన్నారు. అదేవిధంగా గ్రామస్తులు మినరల్ వాటర్ ప్లాంట్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, ఎంపిడివో వెంకట శివానంద్, ఏపీఎం తిలక్ కుమార్, గిర్దావర్ మహమ్మద్ రషీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్ రెడ్డి, యూత్ మండల అధ్యక్షులు బండి హరీష్, గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు పులిశేరు రాజేందర్, పంచాయతీ కార్యదర్శి చేరాలు, జిపిఓ నరసింహస్వామి, సీఏ పడిదం మహేందర్, కాంగ్రెస్ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధికి గ్రామ సంఘాల భవనాలు కీలకం:ఏపీఎం వేణు



**భీమదేవరపల్లి:ఫిబ్రవరి 20(జనం సాక్షి)** మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే గ్రామ సంఘాలకు సొంత భవనాలు అత్యంత అవసరమని ఎంపీడీవో వీరేశం పేర్కొన్నారు.శుక్రవారం మండల కేంద్రంలో కొత్తకొండ, ముల్కనూర్,వంగర, రంగయ్యపల్లి గ్రామాల మహిళా సంఘాల (వీవో) భవనాల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారని వారి కార్యకలాపాలు మరింత విస్తరించాలంటే స్థిరమైన వసతులు అవసరమని తెలిపారు.సొంత భవనాలు ఏర్పడితే సమావేశాలు శిక్షణ కార్యక్రమాలు అవగా హన శిబిరాలు సమర్థవంతంగా నిర్వహించుకోవచ్చని అన్నారు.ఏపీఎం వేణు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు దిశగా ఈ భవనాలు దోహదపడతాయని చెప్పారు.మహిళా సంఘాలు బలోపేతం అయితే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వినయ్, మార్కెటింగ్ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి, కొత్తకొండ సర్పంచ్ సిద్ధమల్ల రమారమేష్, ముల్కనూర్ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, వంగర సర్పంచ్ గజ్జెల సృజన రమేష్, రంగయ్యపల్లి సర్పంచ్ మండల రజిత మహేష్,సీసీలు పి. అశోక్,బి.కర్ణాకర్,వి.సదానందం, పీఎస్ఈసీలు వేణు,నిరంజన్ రెడ్డి అదేవిధంగా మండల వివోలు అమరావతి ,సుమలత,సరిత, సునిత ,పరమేశ్వరి, కవిత,రసజ్ఞ,రజిత, జమున,మానస,పద్మ, నిర్మల,కమలతో పాటు మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరం



### తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు చందన సరిత

**చెన్నారావుపేట, ఫిబ్రవరి 20 ( జనం సాక్షి):** బాల్యవివాహాలు చేయడం చట్టరీత్య నేరమని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు చందన సరిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, స్టోర్ రూం, విద్యార్థుల తరగతి గదులు, చుట్టూ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భ ంగా విద్యార్థులతో ఆమె స్వయంగా మాట్లాడారు. బాల్యవివాహాల పైన, అలాగే బాల్య వివాహం చేసుకోవడం వల్ల వచ్చే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పదవతరగతి విద్యార్థులతో మాట్లాడుతూ మంచి ఉత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ వసుధ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు, బాలల సంక్షేమ సమితి సభ్యులు షాహిదా బేగం, సంపత్, సుజాత, మధు, నర్సంపేట ఐసిడిఎస్ సిడిపిఓ విద్య, చెన్నారావుపేట ఎంఈఓ బైరి సరళ, నర్సంపేట ఎంఈఓ కొర్ర సారయ్య, కస్తూరిబా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంగ్వపేట చెరువు -వాస్తపూర్ జలపాతం అభివృద్ధికి వినతి

### జూపల్లి కృష్ణారావును కలిసిన కుచాడి శ్రీహరి రావు

**నిర్మల్ రురల్,, ఫిబ్రవరి 20 (జనంసాక్షి)**నిర్మల్ నియోజకవర్గాన్ని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ, వెంగ్వపేట గ్రామ చెరువును సాగునీటి వనరుగా మారుస్తూనే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, అలాగే మామడ మండలంలోని వాస్తపూర్ జలపాతాన్ని అధికారిక పర్యాటక ప్రాంతంగా గుర్తించాలని జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు.నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కుచాడి శ్రీహరి రావు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వెంగ్వపేట చెరువు అభివృద్ధి ద్వారా స్థానిక రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, పర్యాటక దృష్ట్యా ఆకర్షణీయంగా తీర్చిదిద్దితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని వారు వివరించారు.అలాగే ప్రకృతి సోయగాలతో అలరారుతున్న వాస్తపూర్ జలపాతాన్ని పర్యాటక శాఖ పరిధిలోకి తీసుకుని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. నిర్మల్ నియోజకవర్గాన్ని సమగ్ర పర్యాటక ప్రాంతంగా గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రిని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ్ భీమ్ రెడ్డి మామడ, మాజీ జడ్పీటీసీ సంతోష్, వెంగ్వపేట మాజీ సర్పంచ్ రమేష్ కుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొట్టే శేఖర్, నాయనగారి మురళి, అజయ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



### న్యాయవాదుల విధుల బహిష్కరణ

**ఖానాపూర్ ఫిబ్రవరి 20 (జనం సాక్షి)** న్యాయవాది ఖదీర్ హత్య, న్యాయవాది నరేష్ నల్గొండ బార్ అసోసియేషన్ సభ్యులపై దుండగుల దాడిని నిరసిస్తూ ఖానాపూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులను బహిష్కరించారు. శుక్రవారం విధులను బహిష్కరించిన సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మంత్రరాజనీ సురేష్ మాట్లాడారు. న్యాయాన్ని రక్షిస్తున్న న్యాయవాదులకే రక్షణ లేకపోవడం శోచనీయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై ఎన్ని రకాల దాడులు జరిగినా ప్రభుత్వాలు న్యాయవాద సంరక్షణ చట్టం రూపకల్పన చేయడంలో తార్కానినీ వహించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పి.రాజలింగం, ఏపీజి ఆసిఫ్ అలీ, న్యాయవాదులు జి.కిషోర్ నాయక్, కమలాకర్, వెంకట్ మహేంద్ర, బి.శివ, బి.రవి లు పాల్గొన్నారు.



## కన్నుల పండుగల అక్షరాభ్యాసాలు



**తాండూర్, ఫిబ్రవరి 20(జనం సాక్షి**మంచిర్యాల జిల్లా,తాండూరు మండలం మాదారం 3 అంగన్వాడి సెంటర్లో శుక్రవారం రోజున చిన్నారులకు అన్నప్రాసన మరియు అక్షరాభ్యాస వేడుకలు కన్నుల పండుగల జరిగాయి. అంగన్వాడీ ఐసిడి ఎస్ సిడిపిఓ సరూప ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమానికి మాదారం సర్పంచ్ కుసనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ , సి.డి.పి.ఓ స్వరూప ముఖ్య అతిథిలుగా హాజరైనారు. పిల్లలందరికీ ముఖ్య అతిథిలు అందరు కలిసి అన్నప్రాసన మరియు అక్షరాభ్యాసాలు జరిపించారు. అనంతరం టీచర్ మీనా హాజరైన సర్పంచ్ కుసనపల్లి లక్ష్మణ్ , ఉప సర్పంచ్ సూరం దామోదర్ , సి.డి.పి.వో స్వరూప మరియు 9 వ వార్డు సభ్యురాలు సౌమ్య కి శాలువాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుసనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ చిన్నారులతో వారి తల్లుల సమక్షంలో ఘనంగా అన్నప్రాసన మరియు అక్షరాభ్యాసాలు జరిపించినందుకు అంగన్వాడీ టీచర్ మీనా కి అభినందనలు తెలియజేశారు.ఇంతే ఉత్సాహంతో రానున్న కాలంలో కూడా పని చేయాలని అన్నారు.అంతే కాక మీకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్న గ్రామ పంచాయతీ నుండి ఇస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఇందిరా ఉప సర్పంచ్ దామోదర్ రెడ్డి వార్డ్ సభ్యులు సౌమ్య సిడిపిఓ స్వరూప సూపర్వైజర్ ఇందిరా అంగన్వాడి టీచర్ మీనా మరియు పిల్లలు తల్లులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### 24న ఆర్ టిసి సమస్యల పరిష్కారానికి చలో సచివాలయం

### రాష్ట్ర అధ్యక్షుడు ఏఆర్ రెడ్డి



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి20,(జనంసాక్షి)** ఆర్టీసీ పరిరక్షణ, ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న చలో సచివాలయం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.ఆర్. రెడ్డి తెలిపారు. యూనియన్లకు అతీతంగా అన్ని డిపోల నుంచి ఉద్యోగులు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, 2021 వేతన సవరణను 30% ఫిట్‌మెంట్‌తో అమలు చేయడం, రూ.2,500 కోట్ల బకాయిలు చెల్లించడం, ఖాళీల భర్తీ, ఉద్యోగ భద్రత కల్పించడం వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

## అన్నదాత అవతారమెత్తిన రైస్ మిల్లర్లు

### కొడవటంచలో మూడు రోజుల పాటు అన్న ప్రసాద వితరణ

### నేడు ముప్పై వేల మందికి ఏర్పాట్లు



**రేగొండ,ఫిబ్రవరి 20( జనం సాక్షి):**మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహా స్వామి వారి పునః ప్రతిష్టాపన లో భాగమై నాలుగు రోజుల పాటు అన్న ప్రసాద వితరణ చేసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు తమ ఔదార్యాన్ని చాటారు. ఈ నెల 18 నుండి నేటి (శనివారం) వరకు స్వామి వారి ప్రతిష్టాపన కార్యక్రమాలు అంగ రంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రతీ రోజు మంత్రులు,నాయకులు, అధికారులు ,భక్తులు వస్తుండగా వారందరికీ భోజన సదుపాయాన్ని సమకూర్చి రోజు ఐదు వేల మందికి అన్న ప్రసాద వితరణ చేస్తున్నట్లుగా అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాండ్ల తిరుపతి గౌడ్ తెలిపారు.శనివారం రతిస్తాపన్ చివరి ఘట్టం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉన్నందున ముప్పై వేల మందికి తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.అన్ని దానాల కెల్ల అన్న దానం గొప్పది కావున స్వామి వారి ప్రతిష్టాపన సమయంలో తమ అసోసియేషన్ కు అన్న వితరణ చేసే అవకాశం కలగడం సంతోషంగా ఉన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ ఆనం సంతోష్,క్యాషియర్ కాసిడి రవీందర్,గౌరవ అధ్యక్షులు అభినవ్ రావు జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సంఘ భవనానికి పది లక్షలు మంజూరు

## ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



**లక్ష్మణ చందా, ఫిబ్రవరి 20, (జనంసాక్షి):** మండలంలోని రాచాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘ భవనం నిర్మాణం కొనసాగుతోంది. గతంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించారు. మరింత నిర్మాణం చేపట్టే దిశగా శుక్రవారం రోజున మరో పది లక్షలు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్డిఎఫ్ నిధుల కింద ఐదు లక్షలు, ఎంపీ నిధుల కింద ఐదు లక్షల రూపాయలను మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బన్నేపోయిన పోశెట్టి, నాయకులు బన్నబోయిన పోశెట్టి, బన్నేబోయిన రాజన్న, భూసి పెంటాజి, భూసి సురేష్, గజ్జల బోర్రన్న, పాల్గొనడం జరిగింది.

# ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరి మృతి...!

## లింగగిరి గ్రామ శివారులో చోటు చేసుకున్న సంఘటన



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని లింగగిరి గ్రామ శివారులో నెక్కొండ- గూడూరుకు వెళ్లే ప్రధాన రహదా రిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... లింగగిరి గ్రామానికి చెందిన ఓరుగంటి నరసింహారావు(65) తన ద్విచక్ర వాహనం పై కంది గడ్డ తండా గ్రామంలో ఓ వివాహ కార్యక్రమానికి వెళ్తున్నాడు. లింగగిరి గ్రామ శివారులోకి వెళ్ళగానే ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు అదుపు తప్పడంతో కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

# చాత్తాద శ్రీవైష్ణవ సంఘం కార్యవర్గం ఏకగ్రీవం



**ఖానాపూర్ (జనంసాక్షి):** చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం ఖానాపూర్ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మంత్ర రాజశీ దేవేందర్, గౌరవ అధ్యక్షులుగా బండపాటి మనోహర్ స్వామి, ప్రధాన కార్యదర్శిగా అసూరి సంతోష్, కోశాధికారిగా శ్రీపెరంబుదూరి శ్రావణ్, వర్కిం గ్ ప్రెసిడెంట్ గా చింతామణి శ్రీనివాస కృష్ణ, న్యాయ సలహాదారుగా మంత్ర రాజశీ సురేష్ లతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మంత్రరాజశీ దేవేందర్ మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించిన కుల బాంధవులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సంఘ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భ ంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# భారీ బకాయిలపై మున్సిపల్ కొరడా



**ఖానాపూర్ (జనంసాక్షి):** మునిసిపల్ పరిధిలోని ఇంటి పన్ను భారీ బకాయి లపై కమిషనర్ సుందర్ సింగ్ కొరడా జలపించారు. శుక్రవారం ఇంటి పన్ను సకాలంలో చెల్లించకుండా నిర్లక్ష్యం వహించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటి పన్ను వివరాలు సేకరించి రెడ్ నోటీసులు జారీ చేయడం జరిగిందని, నోటీసులకు మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాల్సిందేనని తెలిపారు. వివరణ ఇవ్వడంలో జాప్యం వహించిన వారి ఇళ్లకు మున్సిపల్ సిబ్బంది కమిషనర్ సుందర్ సింగ్ ఆదేశాల మేరకు తాళాలు వేశారు. ఇంటి పన్ను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కోరారు. మునిసపాలిటీ రెవెన్యూ అధికారి దాదే రామకృష్ణ, ఎం.రాజు, బిల్ కలెక్టర్ వీరగోనే రమేష్, ముష్కరి రాకేష్, ఉన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**పరకాల, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున పరకాల పట్టణంలోని ప్రభుత్వ గర్ల్స్ స్కూల్లో ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళ్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ నాయకులు మహేష్, సందీప్, వినయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలకు కంప్యూటర్ల బహూకరణ




**గోవిందరావుపేట ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శుక్రవారం ఇన్ఫోసిస్ సంస్థ ద్వారా కంప్యూటర్లను బహుకరించారు. ఇన్ఫోసిస్ ఉద్యోగులు రాపాక నాగరాజు స్వాతి దంపతులు ఈ కంప్యూటర్లను కళాశాల ప్రిన్సిపల్కు అందించడం జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మకంచ, జనగామ ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్ఫోసిస్ సంస్థ అధిపతుల సుధా నారాయణమూర్తి ఆశయాల మేరకు హైదరాబాద్లో పనిచేస్తున్న రాపాక నాగరాజు మరియు స్వాతి దంపతులు కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కొరకు మూడు కంప్యూటర్ సిస్టమ్ లను బహుకరణ చేయడం జరిగింది. కంప్యూటర్ల దాత స్వాతి మాట్లాడుతూ నేటి కాలంలో కంప్యూటర్స్ విద్య ఎంతో అవసరం అని నేను పుట్టి పెరిగిన ఈ ప్రాంతంలో ఉన్న కళాశాల విద్యార్థులకు కంప్యూటర్స్ అందించడం చాలా సంతోషం అని భవిష్యత్తులో ఇంకా కొన్ని కంప్యూటర్స్ అందించి కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని చెప్పడం జరిగింది. కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, మా శెట్టి సంతోష్, రామిని జగదీష్, పడకంటి రవీందర్ మరియు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు త్రాగు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

## ఎంపిడిఓ క్రాంతి కుమార్

**మల్హర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** రానున్న వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి రాకుండా స్వచ్ఛమైన త్రాగు నీటి సరఫరా కోసం చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ క్రాంతి కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పెద్దతూండ్ల, కిషన్రావుపల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఎంపిడిఓ పరిశీలించారు. భగీరథ పైపులైన్ లీకేజిలు మరమ్మతులు చేసి శుద్ధమైన త్రాగునీరు ను నీటి ఎద్దడి రాకుండా అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దతూండ్ల సర్పంచ్ బండారి నర్సింగం, ఎంపీఓ విక్రమ్, మిషన్ భగీరథ ఏఈ అలేఖ్య, గ్రిడ్ ఏఈ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి పెంచాల సతీష్, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.



# ఉచితం గ్యాస్ కనెక్షన్లు పంపిణీ



**గోవిందరావుపేట (జనంసాక్షి):** మండలంలోని పసర గ్రామ పంచాయతీ పరిధిలోని 2వ వార్డులో గ్యాస్ కనెక్షన్ లేక ఇబ్బంది పడుతున్న 20 కుటుంబాలకు శ్రీ ముకుంద ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వారి సహకారంతో శుక్రవారం ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇప్పించడం జరిగింది. ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెండవ వార్డు సభ్యురాలు జక్కు సదాలక్ష్మి హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ముకుంద గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం జక్కు రాజు గౌడ్ గీతరాణి , అభినవా వినయ్ కుమార్, జక్కు రణదీప్ గౌడ్, గోనెల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన

## మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్



**నర్సంపేట ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** నర్సంపేట మున్సిపాలిటీకి చెందిన 19వ వార్డు వాస్తవ్యులు మార్కండేయ కాలనీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులు చేపట్టి శుక్రవారం ప్రారంభోత్సవం చేసుకుంటున్న లబ్ధిదారులు కొంగ రజిత-రాజు దంపతుల ఆహ్వాన మేరకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన నర్సంపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మీరామానంద్ . రిబ్బన్ కటింగ్ చేసి నూతన ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించడం జరిగింది, అనంతరం రజిత-రాజు దంపతులు మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ . శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ ఎలకంటి విజయ్ కుమార్, 4వ వార్డు కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, 18వ వార్డు ఇంచార్జ్ లాక్కార్స్ రమేష్, పట్టణ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి బిట్ల మనోహర్, దేవోజ్ హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి హుండీ లెక్కింపు



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 20, (జనంసాక్షి):** బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని బుగ్గ రాజరాజేశ్వరస్వామి మహాశివరాత్రి జాతర హుండీ లెక్కించినట్లు ఈఓ బాపురెడ్డి తెలిపారు. అభిషేకం ద్వారా 34900/-, బహిరంగ వేలం ద్వారా 345000/-, దర్శనం టికెట్ ద్వారా 379300/-, కల్యాణకట్ట ద్వారా 21020/-, హుండీ ఆదాయం 483058/-, మొత్తం 12,63,278 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు. కాగా గతేడాది 11,39,369 ఆదాయం రాగా ఈఏడాది 1,23,909 రూపాయల ఆదాయం పెరిగిందని వివరించారు.

# నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించాలి

- డీఐఈఓ శ్రీధర్ సుమన్
- పరీక్షా నిర్వాహకుల సన్నాహక సమావేశం




**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** ఫిబ్రవరి 25వ తేదీ నుండి నిర్వహించబోయే ఇంటర్ వార్షిక పరీక్షలను పరీక్షా నిర్వాహకులు బోర్డు నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ ఆదేశించారు. శుక్రవారం నాడు హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఛీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్ మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, అదనపు ఛీఫ్ సూపరింటెండెంట్లకు ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి త్వరలో నిర్వహిం చబోయే థియరీ పరీక్షల వివరాలు తెలియజేసారు. ఇంటర్ బోర్డు ఆదేశాల 26 థియరీ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించ బడుతాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సం. జనరల్ 5210, ఒకేషనల్ 793 మొత్తం 6003 విద్యార్థులు, ద్వితీయ సం. జనరల్ 5356, ఒకేషనల్ 807 మంది మొత్తం 6163 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు గాను జిల్లా పరీక్షల కమిటీ, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్, 26 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 26 మంది డిపార్ట్ మెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. 26 పరీక్షా కేంద్రాల్లో వైద్య సిబ్బంది , బందోబస్తుకు సైతం ఏర్పాట్లు చేయనైనది. వార్షిక పరీక్షలకు గాను అన్ని పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో డ్యుయల్ డెస్కులు, గాలి, నీరు, విద్యుత్, ఫ్యాన్లు, నీటి వసతి మరియు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహనాల రాకపోకలకు, ప్రశ్నాపత్రాలు, సమాధాన పత్రాల స్టోరేజ్, కార్యాలయ విధులు తదితర అంశాలపై పూర్తి వివరాలు తెలియజేసారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నెం. 9240205555 నెంబరును సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థుల మానసిక సమస్యల పరిష్కారం కొరకు 14416 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

## నేడు సమతడిగ్రీ కళాశాలలో జాబ్ మేళా




**తొర్రూరు , ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** నేడు తొర్రూరు పట్టణ కేంద్రంలోని సమత డిగ్రీ కళాశాలలో ప్రథమ్ సంస్థ వారి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుంది. ప్రథమ్ సంస్థ మహబూబాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్ స్రవంతి మాట్లాడుతూ తేదీ 21 ఫిబ్రవరి 2026 శనివారం రోజున ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు 10వ తరగతి ,ఇంటర్ ఐ.టి.ఐ , డిగ్రీ చదువుకున్న పాస్ లేదా ఫెయిల్ ఐనటువంటి యువతీ యువకుల కోసం జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుంది . కావున విద్యార్థులందరూ ఈ సదవకాశంని వినియోగించుకో గలరు యువతకు సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి జాబు లోకి చేర్చుకోవడం జరుగుతుంది. కావున విద్యార్థులు అందరూ వినియోగించుకోవాల్సిందిగా కోరుకుంటున్నాను అని తెలిపారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### మున్సిపల్ కమిషనర్ సంపత్



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 20, (జనంసాక్షి):** అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్ అన్నారు. శుక్రవారం ఆయన బెల్లంపల్లి పట్టణంలోని 13వ వార్డు కాల్టెక్స్ ఏరియాలో జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని ఆదేశించారు. వీదుల్లో కల్వర్టు పనులను త్వరగా నిర్మించాలని కాంట్రాక్టర్ సూచించారు. ఆయన వెంట స్థానిక కౌన్సిలర్ దొంగల రాజ్ కుమార్, బిఆర్ఎస్ నాయకులు చింతల శ్రీనివాస్, హనీఫ్, ఉమామహేష్, వేణు ఉన్నారు.

## ద్రోణ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**లక్ష్మణ చందా, ఫిబ్రవరి 19 (జనంసాక్షి):** లక్ష్మణ చందా గ్రామంలోని ద్రోణ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థిని విద్యార్థులు సంగా అశ్విత, బండి రిషి మహబూబ్ నగర్ లో జరిగే నెట్ బాలుకు; సయ్యద్ నౌమాన్ నిజామాబాద్ లో జరిగే బాస్కెట్ బాలు మరియు పి లాస్య ,ఎం నరేష్ మెదక్ లో జరిగే సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ముఖేష్ తెలపడం జరిగింది. ఇట్టి పోటీలకు తమ స్కూలు విద్యార్థిని విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషం అని పాఠశాల కరస్పాండెంట్ సురేష్ రెడ్డి , ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ ముత్యం తెలపడం జరిగింది.




## నగదు పురస్కారాన్ని పొందిన గురుకుల విద్యార్థులు



**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల వరంగల్ ఈస్ట్ నందు, షీ ఫర్ స్టెమ్ ,కల్పన విజ్ఞానశాల కెరీర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం లోభాగంగా 14 మంది విద్యార్థులు ఇంక్యుబేటర్ ఫేజ్ ను పూర్తి చేసుకుని ఆగ్జిలరేటర్ ఫేజ్ ను చేరుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులందరిలో కేవలం వరంగల్ ఈస్ట్ సోషల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థినులు కల్పన ఇంక్యుబేటర్ ప్రోగ్రాంలో అత్యున్నత ప్రతిభ కనబరిచినందుకు మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ పొందడం జరిగింది . అంతేకాదు ఈ విద్యార్థులలో లిఏడుగురు విద్యార్థులు ఇంటర్న్షిప్ కు ఎంపిక అయ్యారు వీరికి ఒక్కొక్కరికి 10000 చొప్పున నగదు బహుమతిని 26 రోజున టీ హబ్ హైదరాబాదు నందు అందించడం జరుగుతుంది. టీ హబ్ హైదరాబాద్ నందు ఈస్ట్ కళాశా లకు రెండు లాప్టాప్స్ అందిస్తారు.ఈ విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.రాధిక గారు మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ ను అందించి విద్యార్థులను అభినందించారు .కల్పన షీ ఫర్ స్టెమ్ ఫ్యాకల్టీమెంటర్లు ఐన వరంగల్ తూర్పు కళాశాల అధ్యాపకులు డాక్టర్ .పి .వీణ డిపార్ట్మెంట్ ఆఫ్ జువాలజీ ఎం.కేజియా ఎలిజబెత్ డిపార్ట్మెంట్ ఆఫ్ మైక్రో బయాలజీల ఆద్వర్యంలో విద్యార్థులు శిక్షణ పొందారనీ కళాశాల ప్రిన్సిపల్ తెలియజేసారు విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించారు.

## రైతులకు సబ్సిడీ కింద పరికరాలు



**లక్ష్మణ చందా, (జనంసాక్షి) :** మండలంలోని రైతు వేదికలో గురువారం రోజున సబ్మిషన్ మరియు అగ్రికల్చర్ మిషనరీ పథకం కింద సబ్సిడీ పరికరాలు పరికరాలను ఏవో వసంతం మరియు ఎమ్మార్వో సరిత లు పంపిణీ చేయడం జరిగింది. 23 మంది రైతులకు గాను 9 మంది రైతులకు స్ప్రేయర్‌లు, 14 మంది రైతులకు బ్రష్ కట్టర్‌లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రైతులందరూ మరింత అభివృద్ధి పథంలో నడవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈఓలు పవిత్ర, సుష్మిత,మౌనిక , రైతులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**ఖానాపూర్ టౌన్ 20 ఫిబ్రవరి (జనంసాక్షి):** ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1995-97 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక జివిఆర్ ఫంక్షన్ హాల్లో 30 వసంతాల అనంతరం జరిగిన ఈ కార్యక్రమంలో ఆనాటి పూర్వ విద్యార్థులు అధ్యాపకులతో తమకున్న అనుబంధాలను, తోటి విద్యార్థులుతో అనుభూతులను ఆనందంగా పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు శ్రీనివాస్ రెడ్డి రామకృష్ణ ప్రసాద్, జి ఎల్ వి ప్రసాద్, నీల రమేష్, పూర్వ విద్యార్థులు కట్ల శ్రీనివాస్, శెట్టి రాజేందర్, బిల్లా శంకర్, ఎల్దీ శ్రీనివాస్, గంప హరీష, బోసారం గంగాధర్, తోట వనిత, వనజ, మాధవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల రక్షణ - భద్రత పోలీసుల బాధ్యత

### అందుకే నేరాల నిర్మూలనకె కమ్యూనిటీ ప్రోగ్రాం
### ముధోల్ సీఐ.రవీందర్ నాయక్

**ముధోల్,ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** ప్రజల రక్షణ భద్రత పోలీసుల బాధ్యతని అందుకే నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీఐ రవీందర్ నాయక్ అన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని కోలి గల్లిలో వేకువజామున పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 100 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామ ప్రజలతో సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనపడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయి,బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినట్లయితే వెంటనే 100కు ఫోను చేయాలని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత చదువులపై దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెండ్

**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, వరంగల్ ఆదేశాల మేరకు నెక్కొండ మండలం నందు ఏ ఎం ఓ సుజన్ తేజ ఈనెల 18 న రెండు పాఠశాల లను విజిట్ చేసిన సందర్భంలో 1 ఎంపీపీఎస్ అజ్మీరా మంగ్య తండాలో పని చేయుచున్న అంకం ప్రవీణ్ కుమార్,2 ఎంపీపీఎస్ గొట్లకొండ లో పనిచేయుచున్న రామారాపు రవి విధుల కు అనుమతి లేకుండా గైర్హాజరు అయినందుకు ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం జరిగింది. అలాగే సదరు 2పాఠశాలల కు ఉపాధ్యాయులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనందుకు జెడ్పిహెచ్ఎస్ రెడ్లవాడ స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బి. సురేష్ కి షోకాజ్ నోటీస్ జారీ చేయబడింది అని వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు తెలిపారు.

## వంగరలో మహిళా సంఘ భవనానికి భూమిపూజ

- మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి
- సర్పంచ్ గజ్జల సృజన రమేష్



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 20(జనంసాక్షి) :** మహిళలు అన్ని రంగాల్లో ముందుండి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ అన్నారు.శుక్రవారం వంగర గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మదర్ తెరిసా గ్రామ సమాఖ్య సంఘం భవన నిర్మాణానికి ముఖ్య అతిథిగా స్థానిక చర్పంచ్ గజ్జల సృజన రమేష్, హాజరై భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఇప్పటివరకు మదర్ తెరిసా గ్రామ సమాఖ్య సంఘం సభ్యులకు స్వంత భవనం లేకపోవడంతో సమావేశాలు నిర్వహించుకోవడం శిక్షణ కార్యక్రమాలు చేపట్టడం స్వయం ఉపాధి కార్యక్రమాలు అమలు చేయడం వంటి విషయాల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.కొత్త భవనం నిర్మాణం పూర్తయితే మహిళా సంఘాల సమావేశాలు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు,స్వయం ఉపాధి కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించు కోవడా నికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని,మహిళలు ఆర్థికంగా బలపడితే గ్రామాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అన్నారు. మహిళా సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్రవంతి, ఎంపీడీవో,ఏపీఎం,ఉప సర్పంచ్ ఉల్లాల రమేష్,వార్డు సభ్యులు మొండయ్య,తిరుపతి, రమేష్,మహేష్, అంజలి,సాధన, శారద,వివోలు కవిత, కమల,సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు, అధికారులు,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,పెద్ద సంఖ్యలో మహిళలు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బర్రెల కాపరి వాగులో మునిగి మృతి



**తొర్రూరు, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** గురువారం రోజున అనగా తేదీ 19.02.2026 నాడు తొర్రురు మండలంలో గ్రామం సుందర్ నాయక్ తండా, హెచ్. ఓ. జామస్తాన్ పురం కు చెందిన నేతవత్ రవి తండ్రి కిషన్ వయసు 35 సం. లంబాడ వృత్తి కూలి అను అతను రోజు మాదిరిగానే తన యజమాని యొక్క బర్రెలను మేపుటకు జామస్తానుపురం శివారులో ఆకేరు వాగు ఒడ్డున తీసుక పోయి మేపుతుండగా బర్రెలు వాగులోకి వెళ్లగా వాటిని బయటకు కొట్టుకోని రావడానికి సదరు మృతుడు రవి తన చెప్పులను వాగు ఒడ్డున విడిచి వాగులోకి దిగి బయటకు రాక, కనిపించినందున తనతో పాటు మరో జీతాగాడైనా బానోతు వీరు చూసి మృతుని భార్యకు, కుటుంబ సభ్యులకు ఇట్టి విషయం చెప్పగా, మృతిని కుటుంబసభ్యులతో పాటు పెదగాని యాకయ్య, ఎల్తూరి ఎల్లయ్య మరి కొందరు వాగులో వెతుకుతూ రాత్రి మృతిని భార్య యాకమ్మ తన భర్త దొరుక నందున పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇవ్వగా మిస్సింగ్ కేసు సి ఆర్ నెంబర్ 50/2026 గా కేసు నమోదు చేయనైనది.ఈ రోజు వాగులో మృతుని జాడకోసం గజ ఈత గడైనా దేగల వెంకన్న మరి కొందరు వెతుకు చుండగా శుక్రవారం రోజున సుమారు ఉదయం 8 గంటల ప్రాంతంలో వాగు అడుగు భాగంలో చనిపోయి ఉండగా దొరికినాడు. సదరు మృతి చెందిన వ్యక్తి బర్రెలను కొట్టుకొని రావడానికి ఆకేరు వాగులోకి దిగి నీటి ఉధృతంలో ఊపిరి ఆడక చనిపోగా తొర్రురు ఎస్సై గొల్ల మూడి ఉపేందర్ కేసు దర్యాప్తు చేసినట్లు తెలిపినారు.

# ఎస్ఎస్‌సి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా విద్యాశాఖ అధికారి వి రాజేశ్వర్**



**మహబూబాబాద్ బ్యూరో, (జనంసాక్షి):** స్థానిక ఐడిఓసిలోని మార్చిలో జరగబోయే ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై , డీఓలతో జిల్లా విద్యా శాఖ అధికారి సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో 45 పరీక్షా కేంద్రాలకు గాను 45 చీఫ్ సూపరింటెడ్లు, 45 డిపార్ట్మెంట్ ఆఫీసర్ లకు ఒక రోజు ఓరియెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ... ఈ సంవత్సరం ఎస్ఎస్‌సి పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంతంగా ,పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, 45 పరీక్ష కేంద్రాల్లో 8154 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని, ఉదయము 9 గంటల 30 నిమిషాల నుండి 12 గంటల 30 నిమిషాల వరకు పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. సెంటర్లలో శుభ్రత, తాగునీటి సదుపాయం, సి సి కెమెరాలు, ట్యూబ్ లైట్ , టాయిలెట్ , డ్యూయల్ బెంచీలు వాటర్ తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తారని ప్రశ్నాపత్రాల రవాణా, సీలింగ్, తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సెంటర్ల సమీప ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించబడుతుందని , జిరాక్స్ సెంటర్లు మూసి వేయబడతాయన్నారు. సెంటర్‌లోకి ఎట్టి పరిస్థితులలో సిఎస్, డివో, ఇన్విజిలేటర్ విద్యార్థులు, విధులలో పాల్గొనే ఎవరైనా సెల్ ఫోన్ గాని, ఎలక్ట్రానిక్ గాడ్జెస్ గాని సెంటర్లోకి తీసుకుపోరాదని సూచించారు. సి ఎస్ డిఓలు ఇన్విజిలేటర్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించి తగు సూచనలు ఇవ్వాలని ఈ సంవత్సరము మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్ష నిర్వహించబడతాయని, పరీక్షల మధ్యలో విరామం ఉన్నందున టైం టేబుల్ పై విద్యార్థులకు సరైన అవగాహన కల్పించాలని విద్యార్థులు పరీక్షలకు గైహాజరు కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, డి ఎస్ ఓ అప్పారావు, డిసిఇబి సెక్రటరీ బాలాజీ, అన్ని మండల విద్యాశాఖ అధికారులు, సి ఎస్ ,డి ఓ లు కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్లు ఎస్బి శ్రీనివాస్, సిహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రేపు పదవీ బాధ్యతలు చేపట్టనున్న చైర్మన్, వైస్ చైర్మన్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో రేపు(ఆదివారం) మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ లు పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆదివారం రోజున ఉదయం 10 గంటలకు భూపాల పల్లి హనుమాన్ టెంపుల్ నుండి మున్సిపల్ ఆఫీస్ వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం మున్సిపల్ ఆఫీస్ లో పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. భూపాలపల్లి జిల్లాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలు, పట్టణ కమిటీ కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, జిల్లా కమిటీ, ముఖ్య కార్యకర్తలు అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు.

## మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వధూ వరుల పరిచయ వేదిక

**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి):** జిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని అవివాహితులైన మాల వధూవరుల కోసం వధూ వరుల వివాహ పరిచయ వేదిక నిర్వహింప బడుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ తెలిపారు. వచ్చే నెల 8 :03 :26న ఉదయం 10:30 గంటలకు జిల్లా మాల సంక్షేమ సంఘం భవనంలో న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ ఆదిలాబాద్ లో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ విషయాన్ని జిల్లాలోని మాల సమాజానికి చెందిన అందరూ గ్రహించాలని ఆయన కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి వారు తెలిపారు. ప మాల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న అసోసియేట్ ధ్యక్షులు పాశం రాఘవేంద్ర,రఘు, మేదరి స్వామి,అశోక్ సార్,శంఖర్ మహిళ ఉప అధ్యక్షురాలు, విజయగారు,సుకన్య పాల్గొన్నారు.




## విద్యుత్ సరఫరాలో అంతరాయం



**ఖానాపూర్ ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** నెలవారి మరమ్మత్తులలో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ రాంసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కడం, బెల్లాల్, ఖానాపూర్, సుర్జాపూర్ సబ్ స్టేషన్ ల పరిధిలో ఈ అంతరాయం వర్తిస్తుందని వినియోగదారులు గమనించి తమతో సహకరించాలని ఆయన కోరారు. అలాగే రైతులకు త్రీఫేస్ విద్యుత్తు అంతరాయాన్ని రాత్రి సమయంలో సరఫరా చేసి పూరించనున్నట్లు వివరించారు.

## బాసరకు పోటెత్తిన భక్తజనం

**భక్తులతో కిటికీలాడిన ఆలయ ప్రాంగణం**



**బాసర, ఫిబ్రవరి 20 (జనంసాక్షి)** పవిత్ర పుణ్యక్షేత్రమైన చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి భక్తజనం పోటెత్తారు.శుక్రవారం సేవాలాల్ జయంతి సందర్భంగా ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడంతోపాటు పదవ తరగతి అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు జరగబోయే పరీక్షలకు ముందుగా చదువుల తల్లి జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనం భాగ్యం ఉన్నట్లయితే పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించవచ్చనే ప్రగాఢ నమ్మకంతో అమ్మవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. దీంతో ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు ఏర్పాటు చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.



# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : డా.గోపాల్ రావు

## చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి వైద్యులకు మెమోలు జారీ

**మంగపేట ఫిబ్రవరి 20(జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రులలో విధులు నిర్వహిస్తున్నటువంటి వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన మండలం లోని మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి ఆసుపత్రులలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి వైద్యాధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైహాజరు అయ్యారని ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మేరకు మెమోలను ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే బ్రాహ్మణపల్లి వైద్యాధికారి ఫిబ్రవరి 16 తేదీ నుండి నేటి వరకు కూడా ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు హాజరు కాకపోవడంపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్ రావు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయం పై







జిల్లా కలెక్టర్ కు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు. గతంలో కూడా ఇలానే వైద్యాధి కారుడు విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మెమోలను ఇవ్వడం జరిగిందని ఇకపై విధులకు హాజరు కాకపోతే ఉపేక్షించేది లేదు అని ఆయన అన్నారు. అనంతరం ఆసు పత్రిలలో పారిశుధ్యం పై ఆరాతీసి ఆసుపత్రి ఆవ రణలలో వెంటనే పారిశుద్ధ్య చర్యలను ఆయా గ్రామ పంచాయతీ సిబ్బందిచే చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు.

# రాష్ట్రస్థాయి రెస్లింగ్ పోటీలకు హర్షిత



**తాండూర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** మంచిర్యాల జిల్లా: తాండూర్ మండలం అచ్చలాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని హర్షిత 9వ తరగతి బంగారు పతకం (ప్రథమ బహుమతి) సాధించి రాష్ట్రస్థాయి సీఎం కప్ రెస్లింగ్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 14న మంచిర్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో హర్షిత బంగారు పతకం సాధించిందని హెచ్ఎం ఉమాదేవి, పీడీ సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 23 వరకు హైదరాబాద్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హర్షితను అభినందించారు.

# బాలల హక్కుల పరిరక్షణ కోసం అధికారులు కృషి చేయాలి

## బాలల హక్కుల కమిషన్ సభ్యుడు బోర్ర వచన్ కుమార్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బాలల హక్కుల పరిరక్షణ కోసం అధికారులు కృషి చేయాలని బాలల హక్కుల కమిషన్ సభ్యుడు బోర్ర వచన్ కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. జిల్లాలోని పలు పాఠశాలలను, హాస్పిటల్ ను తనిఖీ చేశారు. ముందుగా ఆయనకు జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి పుష్పగుచ్ఛంతో స్వాగతం తెలిపారు. తదనంతరం బాలల హక్కుల కమిషన్ సభ్యుడు బోర్ర వచన్ కుమార్ భూపాలపల్లిలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలను, అంగన్వాడి సెంటర్ ను, మైనార్టీ బాలుర పాఠశాలను, ప్రభుత్వ హాస్పిటల్ ను, సింగరేణి ఏరియా హాస్పిటల్ ను, కాటారంలోని చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ ను సందర్శించి, బాలల భవిష్యత్తు కోసం, వారి హక్కుల కోసం ప్రతి ఒక్క శాఖ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని, నేటి బాలలే రేపటి పౌరులుగా నవ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించి భవిష్యత్ తరాన్ని బాగు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ చైర్మన్ అనిల్ చంద్రరావు, డిఎం అండ్ హెచ్ ఓ మధుసూదన్, డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకటరత్నం, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిర, వెటర్నరీ డాక్టర్ కుమారస్వామి, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ తిరుపతి,సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు

## నారక్కపేట విద్యార్థుల ఎంపిక

**నల్లబెల్లి, (జనంసాక్షి):** మండలంలోని నారక్కపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ ఈనెల10వ తేదీన వరంగల్ ఓసిటీలో జరిగిన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలలో కదిరిక విజయ్ పాల్గొని లాంగ్ జంప్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. అలాగే కదిరిక రణధీర్ 80 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించాడు. జిల్లాస్థాయి లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 20 నుండి 23వ తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని అన్నారు . సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలలో రాణించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



# బాసర ట్రిబుల్ ఐటీ నిధుల గోల్మాల్

## ఆర్టిఐ ద్వారా గుట్టు రట్టు చేసిన తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ

## నిధుల గోల్మాల్ చిట్టా విప్పిన విద్యార్థులకు రక్షణ కల్పించాలనీ టీఎస్ ఏఎస్ డిమాండ్...

**బాసర, (జనంసాక్షి)** బాసర ట్రిబుల్ ఐటీ కి ప్రభుత్వం కేటాయించిన నిధులలో గోల్మాల్ జరిగిందని టి ఎస్ ఏ ఎస్ ఆర్.టి.ఐ యాక్ట్ ద్వారా చిట్టా విప్పింది. 2019 నుంచి 2024 వరకు ఈ ఐదు సంవత్సరాలలో 57 కోట్ల రూపాయల తేడాలను గుర్తించామని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ టీఎస్ ఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. నిధుల కేటాయింపు ఖర్చుల మధ్య భారీ వ్యత్యాసం విషయంలో విజిలెన్స్ విచారణ థర్డ్ పార్టీ ఫైనాన్షియల్ ఆడిట్ చేయించాలని బాసర ట్రిబుల్ ఐటీ విద్యార్థి సంగం డిమాండ్ చేసింది. జరిగిన సంఘటనల కు విద్యార్థులు ఆందోళన బాట పట్టగ, వారి స్వేచ్ఛ భావాలను హరించే విధంగా ప్రవర్తిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ నిధులలో జరిగిన గోల్మాల్ విషయం ప్రభుత్వం పటిష్ఠ బందోబస్తు తో ఆడిట్ చేయించి నిధుల గోల్మాల్ కు సంబంధించిన వారందరి పై గట్టి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్న వీటికి సరియైన కారణాలు తెలియడం లేదని పేర్కొంటు న్నారు. ఏదేమైనాప్పటికీ ఇంత పెద్ద మొత్తంలో నిధుల గోల్మాల్ జరగడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం వెంటనే నిధులలో జరిగిన అవకతవకలను వెలికి తీసి యూనివర్సిటీలో జరుగుతున్న విద్యార్థులకు సహకరించాలని గ్రామస్తులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# చెన్నూరులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి పోలీసులు



**చెన్నూర్ (జనంసాక్షి):** చెన్నూర్ పట్టణంలో రామగుండం సీపీ, మంచి ర్యాల డీసీపీ జైపూర్ ఏసీపీ ఆదేశాలమేరకు ఈరోజు చెన్నూర్ పట్టణ పోలీస్ ల ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు చెన్నూర్ లోని అస్నాద్ ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్ చేపట్టినారు . ఇట్టి వాహనాల తనిఖీలలో మద్యం సేవించి వాహనా లు నడిపిన 4 గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినారు. అదేవిధంగా ట్రాఫిక్ రూల్స్ కు వ్యతి రేఖంగా లైసెన్స్ లేకుండా వాహనదారుల, ట్రిపుల్ రైడింగ్, వాహన పత్రా లు సరిగలేని వాహనాలపై చాలాన్ వేయడం జరుగుతుందన్నారు. ఈ యొక్క స్పెషల్ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యం మద్యం సేవించి వాహనాలు నడ పడం ద్వారా, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల, హెల్మెట్ ధరించకపోవడం వల్ల, రాంగ్ రూట్లో వాహనాలు నడపడం వల్ల ప్రమా దాలు సంభవించి ఎంతోమంది తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకుం టున్నారు. దానిని అరికట్టుటకు ఈ యొక్క వాహనాల తనిఖీలు ప్రతిరోజు చెన్నూర్ పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుంది

# శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడి మహిళకు తీవ్ర గాయాలు



**ముథోల్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** నిర్మల్ జిల్లా ముథోల్ మండలం లోని చించాల గ్రామంలోశిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగి పడి మహిళకు తీవ్ర గాయాలైనాయి. వివరాల్లోకి వెళ్తే బైంసా మండలంలోని మాగం గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి శుభకార్యం నిమిత్తంతో చించాల గ్రామానికి వచ్చింది. శుక్రవారం ఇంటి ముందర ఆరు బయట ఉదయం పండ్లు తోముతూ ఉండడంతో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం ఒకేసారి విరిగి లక్ష్మిపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెకు బైంసా ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం నర్మల్ ఆసుపత్రికి తరలించారు. ఏదేమైనాప్పటికీ సంబంధిత అధికారులు శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను గమనిం చకుండా ఉండడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో శిథిలావస్థలో ఉన్న స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

# మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను మర్యాదపూర్వకంగా కలిసిన ట్రస్మా సభ్యులు



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి20, (జనంసాక్షి):** తెలంగాణ గుర్తింపు పొందిన స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) సభ్యులు శుక్రవారం కొత్తగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పులమాలతో సన్మానించారు. ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసి, విద్యా రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మున్సిపల్ యంత్రాంగం సహకారం అందించాలని వారు కోరగా, చైర్మన్ మరియు వైస్ చైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో అయ్యన్న గారి శ్రీధర్ తో పాటు ట్రస్మా బాద్యులు పాల్గొన్నారు.

# భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

జనరల్ ఆస్పత్రిలో కొనసాగుతున్న వైద్య సేవలు, సిటీ స్కాన్, ఎమ్మారై, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు, నూతనంగా నిర్మిస్తున్న నాలుగో అంతస్తు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణ పనులు, ఎమ్మారై, సిటీ స్కాన్, డయాలసిస్ సెంటర్ పై కలెక్టర్ సమీక్ష చేసి, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న నాలుగో అంతస్తు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, సీలింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఏసీ ఫిట్టింగ్, తలుపులు, కిటికీలు తదితర సివిల్ పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మారై యంత్రం ఏర్పాటు కోసం అవసరమైన సీలింగ్, ఏసీ ఫిట్టింగ్, విద్యుత్ సరఫరా, కంప్యూటర్ మార్పులు తదితర పనులను పూర్తి చేసి నిర్ణీత గడువులోగా ఏర్పాటు చేయాలని తెలిపారు. సిటీ స్కాన్ యంత్రం ప్రారంభమైనప్పటికీ టెక్నీషియన్ కొరత కారణంగా సేవలు అందుబాటులోకి రాలేదని, వాకింగ్ ఇంటర్వ్యూల ద్వారా సిటీ స్కాన్ టెక్నీషియన్ నియామకం చేపట్టి త్వరితగతిన సేవలను ప్రారంభించాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణలో ఖాళీగా ఉన్న డైస్ భవనంలో ఆఫ్తాల్మాలజీ, సైకియాట్రీ, ఫిజియోథెరపీ, డెంటల్ ఓపీలు ప్రారంభించి రోగులకు సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి 5 పడకల డయాలసిస్ సెంటర్ మంజూరైన నేపథ్యంలో గదులను గుర్తించి నీటి, విద్యుత్, ఏసీ తదితర సౌకర్యాలతో నూతన డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నాలుగు దిక్కుల చెత్త డబ్బాలను ఏర్పాటు చేసి చెత్తను సరైన విధంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఆస్పత్రికి మూడు వైపులా ఉన్న గేట్ల వద్ద క్యాటిల్ ట్రాప్‌లు ఏర్పాటు చేసి పందులు, కుక్కలు సంచరించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలతో పాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం అత్యంత ముఖ్యమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకటరత్నం, టీజీ ఎమ్ ఐ డి సి ఇంజినీర్ రవి కిరణ్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలి

పైప్ లైన్ కు ఆన్ ఆఫ్ పెట్టించాలని ఇండ్లవాసులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అక్కడే ఉన్న ఆర్ అండ్ బి, మున్సిపల్ అధికారులను సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా రోడ్లు, డ్రైనేజీలను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించి ఇండ్ల నివాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇళ్ళ సముదాయంలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు తెలియజేశారు.

ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, జిడబ్ల్యూఎంసి కాజీపేట డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, కాజీపేట, హనుమకొండ తహసీల్దార్లు రాజు, రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# సమ్మయ్య కుటుంబానికి అండగా ఉంటాం

- **సర్పంచ్ మేకల రాధా సుదర్శన్**

**గోవిందరావుపేట (జనంసాక్షి) :** సమ్మయ్య కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని చల్వాయి సర్పంచ్ మేకల రాధా సుదర్శన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన అనిరెడ్డి సమ్మయ్య తల్లి మణెమ్మ దశ దిన ఖర్మ కూ సర్పంచ్ హాజరై సమ్మయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి మన్నెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గనపాక సుధాకర్, చల్వాయి గ్రామ కార్యదర్శి రాజశేఖర్ , సోమలగడ్డ కార్యదర్శి శ్రీధర్ , కార్యదర్శి చుంచు భారతి , మరియు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండలో సీఎం కప్-2025 ఎడిషన్-2 ప్రారంభం

హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 20 (జనం సాక్షి) : హనుమకొండ రూరల్ టు గ్లోబల్ - క్రాఫ్టింగ్ ఛాంపియన్స్ నినాదంతో నిర్వహిస్తున్న సీఎం కప్--2025 క్రీడోత్సవాన్ని హనుమకొండలోని జేఎన్ఎస్ గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మరియు పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య ,జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి అశోక్,ఏసీపీ నర్సింగరావు, సారంగపాణి,ప్రభాకర్ రెడ్డి, క్రీడాకారులు, కోచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.



# ప్రార్థించే పెదవుల కన్నా - సాయం చేసే చేతులే మిన్న

- **ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి**
- **ఇన్ఫోసిస్ సంస్థ కంప్యూటర్ల బహుకరణ**
- **దాతలు ఇన్ఫోసిస్ సంస్థ ఉద్యోగులు రాపాక నాగరాజు స్వాతి దంపతులు**




గోవిందరావుపేట (జనం సాక్షి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మకంచ, జనగామ ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్ఫోసిస్ సంస్థ అధిపతుల సుధా నారాయణమూర్తి ఆశయాల మేరకు హైదరాబాద్లో పనిచేస్తున్న రాపాక నాగరాజు మరియు స్వాతి దంపతులు కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కొరకు మూడు కంప్యూటర్ సిస్టమ్ లను బహూకరించారు. కంప్యూటర్ల దాత స్వాతి మాట్లాడుతూ నేటి కాలంలో కంప్యూటర్స్ విద్య ఎంతో అవసరం అని నేను పుట్టి పెరిగిన ఈ ప్రాంతంలో ఉన్న కళాశాల విద్యార్థులకు కంప్యూటర్స్ అందించడం చాలా సంతోషం అని భవిష్యత్తులో ఇంకా కొన్ని కంప్యూటర్స్ అందించి కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ‌లిప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్నలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, మా శెట్టి సంతోష్, రామిని జగదీష్, పడకంటి రవీందర్ మరియు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

# శ్రీ వరద దత్తక్షేత్రంలో మండప శంకుస్థాపన కార్యక్రమం

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** ములుగు రోడ్డు లోని శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో రెండు రోజులుగా అవధూత దత్త పీఠం నుండి విచ్చేసిన బ్రహ్మశ్రీ కళ్యాణ్ శర్మ పర్యవేక్షణలో శ్రీ హనుమత్ హోమం, శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి వారి కళాపకర్షణ (స్వామి వారిని వేరేచోట ప్రతిష్ట తాత్కాలికంగా) కార్యక్రమాలను నిర్వహించడం జరిగినది. కూడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి ఆశ్రమానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకోవడం జరిగినది.అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదం, అల్పాహారం వితరణ జరిగినది.



హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి , స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్ మరియు నగర ప్రముఖులందరూ విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ గణపతి సచ్చిదానంద సభ మండపం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిన్న, ఈరోజు కార్యక్రమాలలో పాల్గొన్న ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు మరియు దత్త భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.శ్రీ వరద దత్త క్షేత్రంలో శ్రీ గణపతి సచ్చిదానంద సభ మండపం పనులు ప్రారంభం అయినవి అని ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ వామన్ రావు తెలిపారు.

# నేడే కోటంచ లక్ష్మీ నరసింహ స్వామి వారి పునః ప్రతిష్టాపన

**రేగొండ,ఫిబ్రవరి 20( జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ప్రతిష్టాపన కార్యక్రమాన్ని అంగరంగ వైభవోపేతంగా జరిగేందుకు తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 18 నుండి ప్రారంభమైన ప్రతిష్టాపన



కార్యక్రమాలు శనివారంతో ఆఖరి ఘట్టానికి చేరుకున్నాయి.నరసింహ మూర్తిని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ప్రతిష్టాపన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు తెలిపారు.ప్రతిష్టపనకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ ఎస్.మహేష్ పేర్కొన్నారు.

# నర్సంపేట మున్సిపల్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



**నర్సంపేట ఫిబ్రవరి 20 ( జనం సాక్షి) :** నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో వేద పండితుల మధ్య పూజ కార్యక్రమాలు నిర్వహించి బాధ్యతలు శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా బాధ్యతలు చేపట్టారు వారు మాట్లాడుతూ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి సహకారంతో నర్సంపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతాం అని అన్నారు. ఎలాంటి బెషజలం లేకుండా నర్సంపేట మున్సిపాలిటీలోని 30 వార్డులకు అన్ని రకాలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తామని తెలియచేశారు. నర్సంపేట పట్టణ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ముల్కనూరులో ఉచిత మెగా వైద్య శిబిరం



**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 20(జనం సాక్షి) :** మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు,జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచనలతో హనుమకొండ జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ.అప్పయ్య ఆధ్వర్యంలో శనివారం భీమదేవరపల్లి మండలం ములుకనూర్ గ్రామంలోని మోడల్ స్కూల్ ప్రాంగణంలో (రైతు వేదిక సమీపంలో) ఉచిత మెగా వైద్య శిబిరాన్ని హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా వైస్ చైర్మన్,జిల్లా కాంగ్రెస్ నాయకులు పెద్ది వెంకటనారాయణ మాట్లాడుతూ, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించబడుతుందని తెలిపారు. శిబిరంలో జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల నుండి ఎనిమిది విభాగాల నిపుణ వైద్యులు సేవలు అందించనున్నారు. జనరల్ మెడిసిన్,ఎముకల వైద్యం,స్త్రీ రోగాలు, చర్మవ్యాధులు,కంటి, చెవి-ముక్కు-గొంతు, పిల్లల వైద్యం, శస్త్రచికిత్స వంటి విభాగాల ప్రత్యేక నిపుణులు పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించనున్నారు. అలాగే రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని వైద్య సేవలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు జక్కుల అనిల్, వంగర వైద్యాధికారి డాక్టర్ రెహమాన్,తదితరులు పాల్గొన్నారు